సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 2 । డిసెంబర్ । 2022

రెండు రోజుల పాటు చాపరాయి మూత



డుంబ్రిగుడ: కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతం సందర్శనను రెండు రోజుల పాటు నిలిపివేశారు. ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన కలెక్టర్ సుమిత్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టెండర్‌దారులకు వెంటనే నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవో,తహసీల్దార్, పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం, శుక్రవారాల్లో చాపరాయి సందర్శనకు పర్యాటకులకు అనుమతించవద్దని, చెత్తను పూర్తిగా తొలగించిన తరువాతే అనుమతించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో గురువారం చాపరాయి జలపాతం గేటుకు పంచాయతీ అధికారులు తాళం వేశారు. రెండు రోజుల పాటు సందర్శకులను అనుమతించబోమని పంచాయతీ అధికారులు తెలిపారు.

ఇద్దరు వైఎస్సార్ క్రాంతిపథం సీసీలు సస్పెన్షన్

వీఆర్‌పురం: వైఎస్సార్ క్రాంతిపథంలో జరిగిన నిధుల దుర్వినియోగానికి సంబంధించి ఇద్దరు సీసీలను సస్పెండ్ చేస్తూ చింతూరు ఐటీడీఏపీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ గురువారం ఆదేశాలు జారీచేశారు. సీసీలు షణ్ముఖేశ్వరరావు, రామాంజనేయులును సస్పెండ్ చేసినట్టు ఏపీడీ శ్రీనివాసరావు తెలిపారు.

న్యూస్‌రీల్

భూములు రీ సర్వే చేసి, హక్కు పత్రాలు అందజేస్తాం

- పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్



జాగరంపల్లిలో రీసర్వేను పరిశీలిస్తున్న పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: ఏజెన్సీలో ప్రభుత్వ, ప్రైవేట్ భూములను రీసర్వే చేసి, హక్కు పత్రాలు అందజేయనున్నట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. మండలంలోని జాగరంపల్లి గ్రామంలో జరుగుతున్న సర్వే తీరును గురువారం వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గ్రామాల్లో భూములు రీ సర్వే చేసే సమయంలో గ్రామ సర్పంచ్, పెద్దలను సమావేశపరచాలన్నారు. గ్రామంలో ఎంత మంది సర్వేయర్లు, టెక్నికల్ సిబ్బంది పనిచేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. రీ సర్వేకు సంబంధించి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ పాదిలి వెంకటేశ్వరరావు, వీఆర్‌వో గుణభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌జీసీ జిల్లా సమన్వయకర్తగా కొండబాబు



డీఈవోను రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కొండబాబు

పాడేరు రూరల్: నేషనల్ గ్రీన్‌కార్ప్స్(ఎన్‌జీసీ) జిల్లా సమన్వయకర్తగా గుజ్జెలి కొండబాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఎన్‌జీసీ డైరెక్టర్ పి.స్రవంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో రమేష్‌ను... కొండబాబు పాడేరులో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రసుత్తం ఈయన అనంతగిరి మండలంలోని శివలింగపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులతో సమన్వయంతో ఎకో క్లబ్‌లు ఏర్పాటు, పాఠశాలల్లో పచ్చదనం పరిరక్షణ, పర్యావరణహిత కార్యక్రమాలు విస్తృతం చేయాలని డీఈవో సూచించినట్టుగా కొండబాబు తెలిపారు.


క్రీడలతో మానసిక ఉల్లాసం



పోటీలను ప్రారంభిస్తున్న క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ మూర్తి

అరకులోయ రూరల్: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని స్థానిక క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ మూర్తి తెలిపారు. జగనన్న క్రీడా సంబరాల్లో భాగంగా స్థానిక క్రీడా పాఠశాల మైదానంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలను గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో నిర్వహించిన డివిజన్ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నట్టు చెప్పారు. ఇక్కడ వాలీబాల్, క్రికెట్, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారు. తొలిరోజు వాలీబాల్ పోటీలు జరిగాయి. విజయం సాధించిన జట్లకు రూ.50లక్షల నగదు బహుమతి అందజేయనున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో పీఈటీలు సూరిబాబు, బాలు తదితరులు పాల్గొన్నారు.

జీసీసీ గిడ్డంగి తనిఖీ



పాడేరులో జీసీసీ గిడ్డంగిలో రికార్డులను తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ శ్రీవాత్సవ

సాక్షి,పాడేరు: స్థానిక జీసీసీ గిడ్డంగిని అసిస్టెంట్ కలెక్టర్ శ్రీవాత్సవ గురువారం తనిఖీ చేశారు.పౌరసరఫరాలశాఖ సరఫరా చేసిన పీడీఎస్ బియ్యం ,ఇతర నిత్యావసరాలు, స్టాకు రికార్డులను పరిశీలించారు. అనంతరం గిడ్డంగిలో నిల్వలను తనిఖీ చేశారు. నిత్యావసరాల నిల్వలు,రికార్డులు సక్రమంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు.డీఆర్ డిపోలు,గిరిజన విద్యాలయాలు,అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రతీనెలా సమయానికి నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని ఇక్కడ గిడ్డంగి సూపరింటెండెంట్ సత్యనారాయణ ను అసిస్టెంట్ కలెక్టర్ ఆదేశించారు.

ఏవోబీలో రెడ్ అలర్ట్



ఏవోబీలో పోలీసుల నిఘా

- నేటి నుంచి మావోయిస్టుల పీఎల్‌జీఏ వారోత్సవాలు
- విజయవంతం చేయాలని ఏవోబీ మావోయిస్టు నేత గణేష్ ప్రకటన విడుదల
- అడవిని జల్లెడపడుతున్న పోలీసులు



ఏవోబీలో గాలింపు చర్యలు చేపడుతున్న పోలీసు బలగాలు

సాక్షి, పాడేరు: మావోయిస్టుల పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) వారోత్సవాల నేపథ్యంలో ఏవోబీలో రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఈ ఏడాది కూడా ఈనెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే పీఎల్ జీఏ వారోత్సవాలను విజయవంతం చేయాలని మావోయిస్టు పార్టీ నేత గణేష్ ప్రకటన చేసిన నేపథ్యంలో ఆంధ్రా,ఒడిశా రాష్ట్రాల పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. మావోయిస్టులు ఏవోబీ వ్యాప్తంగా పోలీసుల నుంచి నిర్బంధం ఎదుర్కొంటున్న నేపథ్యంలో పీఎల్‌జీఏ వారోత్సవాలకు పిలుపునివ్వడం చర్చనీయాంశంగా మారింది. ఏవోబీలో గతంలో కన్న మావోయిస్టుల ప్రాబల్యం తగ్గినప్పటికీ, ఈ వారోత్సవాలతో జిల్లా వ్యాప్తంగా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. వారోత్సవాలను భగ్నం చేసే లక్ష్యంతో వ్యూహాత్మకంగానే చర్యలు తీసుకుంటోంది. చింతూరు, ముంచంగిపుట్టు, అరకులోయ, పెదబయలు, జీకే వీధి, డుంబ్రిగుడ, హుకుంపేట, జి.మాడుగుల, చింతపల్లి మండలాల్లోని మారుమూల గ్రామాలు, ఒడిశా రాష్ట్రంలోని పోలీసుబలగాలన్నింటినీ అప్రమత్తం చేశారు. అవసరమైన చోట డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నారు. జిల్లా కేంద్రం పాడేరుతో పాటు,అన్ని మండల కేంద్రాల్లో ఇప్పటికే ఏర్పాటుచేసిన సీసీకెమెరాలద్వారా అనుమానాస్పద వ్యక్తులకదలికలనుక్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

నిర్బంధంలో మావోయిస్టులు

ఏవోబీలోని మావోయిస్టు పార్టీకి రెండేళ్ల నుంచి ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి. ఆంధ్రా-ఒడిశా పోలీసు బలగాలు ఏవోబీ వ్యాప్తంగా కూంబింగ్‌లతో జల్లెడ పడుతుండడంతో నిర్బంధ వాతావరణం నెలకొంది. అలాగే పలు ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లతో మావోయిస్టు పార్టీకి ఏవోబీలో గట్టిదెబ్బే తగిలింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మాత్రం మావోయిస్టులకు కాస్త సురక్షిత ప్రాంతంగా మారింది. అక్కడ నుంచే ఏవోబీలో మావోయిస్టు పార్టీ నేతలు తమ కార్యకలపాలను నిర్వహిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. మావోయిస్టులు,మిలీషియా సభ్యులు, సానుభూతిపరులు జనజీవన స్రవంతిలో కలవాలని ఆంధ్రా, ఒడిశా పోలీసుశాఖలు పిలుపునిస్తుండడంతో మావోయిస్టులు ఉద్యమం బాట వీడి బయటకు వస్తున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో మారుమూల గ్రామాల్లో రోడ్లు,వంతెనల నిర్మాణాలు,ఇతర అభివృద్ధి కార్యక్రమాలు భారీగా జరుగుతుండడంతో గిరిజనులంతా అభివృద్ధికి జై కొడుతున్నారు. పీఎల్‌జీఏ వారోత్సవాలతో గిరిజనులు తమ గ్రామాలకే పరిమితమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

పోలీసుల భారీ వ్యూహం

ఏవోబీ వ్యాప్తంగా మావోయిస్టులు తలపెట్టిన పీఎల్‌జీఏ వారోత్సవాలను పూర్తిగా భగ్నం చేసే లక్ష్యంగా ఇరురాష్ట్రాల పోలీసు యంత్రాంగం వ్యూహాత్మకంగానే వ్యవహరిస్తోంది. ఇప్పటికే ఒడిశాలోని మల్కన్‌గిరి, కోరాపుట్ జిల్లాలతో పాటు జిల్లాలోని మారుమూల ప్రాంతంలో ఉన్న అన్ని అవుట్ పోస్టుల పోలీసు బలగాలు కూంబింగ్‌లో నిమగ్నమయ్యాయి. ముందస్తు వ్యూహంగా అడివంతా జల్లెడ పడుతున్నాయి. మారుమూల గ్రామాల్లో గాలింపు చర్యలు విస్తృతం చేశారు. జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలోను ఉన్నతాధికారులు రెడ్ అలర్ట్‌ను అమలు చేస్తున్నారు. పీఎల్‌జీఏ వారోత్సవాలు ముగిసేంత వరకు ఏజెన్సీ వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలు, ప్రధాన రోడ్లు, మారుమూల ప్రాంతాలకు వెళ్లే జంక్షన్ల వద్ద వాహనాల తనిఖీలను కూడా చేపడుతున్నారు. బాంబు స్క్వాడ్‌లతో అటవీప్రాంతంలో తనిఖీలు చేపడుతున్నారు.



గతంలో పీఎల్‌జీఏ వారోత్సవాల్లో మావోయిస్టులు (ఫైల్)

వన్య మృగం జాడ కోసం కెమెరాల ఏర్పాటు



నరసాపురం పరిసర అటవీ ప్రాంతంలో ట్రాప్ కెమెరాలు అమర్చుతున్న సిబ్బంది

రంపచోడవరం: పులి గాండ్రింపులు పోలిన శబ్దాలతో గిరిజనులు హడలిపోతున్న నేపథ్యంలో ఆ అరుపులు ఏ మృగానివో తెలుసుకునేందుకు అటవీశాఖ అధికారులు ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. నరసాపురం పరిసర ప్రాంతాల్లో పులి గాండ్రింపులు వినిపించాయని తెలియడంతో రంగంలోకి దిగిన అటవీశాఖ అధికారులు పులి సంచరించే అవకాశం ఉన్న ప్రాంతాల్లో గురువారం ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. నరసాపురం రిజ్వర్ ఫారెస్టు, పోక్సుపేట, రామన్నపాలెం, కన్నరం రోడ్డులో వీటిని ఏర్పాటు చేశారు. నరసాపురం పరిసర ప్రాంతాల్లో లభించిన పాదముద్రలను సేకరించిన అధికారులు.. నిర్ధారణ కోసం వైల్డ్‌లైఫ్ ల్యాబ్‌కు పంపించారు. పోక్సుపేట సమీపంలోని అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న వన్యమృగం గురించి తెలుసుకునేందుకు నాలుగు ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు పోక్సుపేట రేంజర్ కరుణాకర్ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, భయపడాల్సిన పనిలేదని చెప్పారు.వన్య మృగాల పాదముద్రలు గాని, సంచరించిన జాడ గాని తెలిస్తే వెంటనే అటవీ శాఖ సిబ్బందికి తెలియజేయాలని కోరారు.

తొలిరోజు 65.53 శాతం

ఉత్సాహంగా పింఛన్ల పంపిణీ

సాక్షి,పాడేరు: వైఎస్సార్ పింఛన్‌కానుకను గురువారం తెల్లవారుజాము నుంచే గ్రామ వలంటీర్లు ఉత్సాహంగా పంపిణీ చేశారు. పొగమంచు దట్టంగా కురుస్తూ చలిగాలులు విజృంభిస్తున్నా ఖాతరు చేయకుండా తొలిరోజు 65.53 శాతం మందికి నగదు అందజేశారు. జిల్లాలోని 22మండలాల్లో 1,20,365మంది సామాజిక పింఛన్‌దారులు ఉండగా 78,880మందికి పింఛన్ అందజేశారు. తొలిరోజు పింఛన్ల పంపిణీలో రాజవొమ్మంగి ప్రథమ స్థానంలో నిలిచింది. మిగిలిన పింఛన్‌దారులకు శుక్ర,శనివారాల్లో పూర్తి చేయనున్నారు.



అనారోగ్యంతో ఉన్న సింహాచలం అనే మహిళకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మహాలక్ష్మి

మండలాల వారీగా వివరాలు

మండలం	పింఛన్ దారుల సంఖ్య	తొలి రోజు పంపిణీ జరిగిన వారి సంఖ్య
రాజవొమ్మంగి	5,992	4,404
కూనవరం	348	250
ముంచంగిపుట్టు	6,083	4,369
పెదబయలు	5,881	4,181
హుకుంపేట	6,910	4,808
దేవీపట్నం	4,218	2,910
వి.ఆర్.పురం	377	255
చింతూరు	1,700	1,116
అడ్డతీగల	5,386	3,509
గంగవరం	3,321	2,118
రంపచోడవరం	3,635	2,290
మారేడుమిలి	2,007	1,252
డుంబ్రిగుడ	6,202	3,821
చింతపల్లి	8,804	5,362
అనంతగిరి	5,777	3,509
పాడేరు	6,282	3,735
జి.మాడుగుల	6,310	3,653
జీకేవీధి	7,149	4,095
అరకులోయ	6,321	3,618
కొయ్యూరు	7,374	3,805
వై.రామవరం	3,257	1,567
ఎటపాక	441	131

రూ. 26.38 లక్షలు గుటకాయస్వాహా

- స్వయం సహాయక సంఘాల్లో నిధుల దుర్వినియోగం
- తేల్చిచెప్పిన విచారణ కమిటీ
- బాధ్యులపై చర్యలకు చింతూరు ఐటీడీఏ పీవో ఆదేశం

చింతూరు: మండలంలోని ఎర్రంపేట, అల్లిగూడెం, రత్నాపురంలోని స్వయం సహాయక సంఘాల్లో నిధుల దుర్వినియోగం వాస్తవమేనని నలుగురు సభ్యుల విచారణ కమిటీ తేల్చిచెప్పింది. దీంతో బాధ్యులపై చర్య తీసుకోవాలని ఏపీడీని ఐటీడీఏ పీవో ఆదేశించారు. రూ.26.38 లక్షల మేర ఆర్థిక అవకతవకలు జరిగినట్టు తేల్చిన విచారణ కమిటీ డీఆర్‌డీఏ పీడీ మురళికి నివేదిక సమర్పించింది. వైఎస్సార్ క్రాంతిపథంలో పనిచేసిన సిబ్బంది తమ సొంత ఖాతాలకు మళ్లించుకుని అవకతవకలకు పాల్పడ్డారంటూ గతంలో ఆరోపణలు రావడంతో అప్పటి ఐటీడీఏ పీవో రామశేషు ఆదేశాల మేరకు పీడీ మురళి.. విచారణకు నలుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు రెండురోజుల పాటు ఎర్రంపేట, అల్లిగూడెం, రత్నాపురంలో పర్యటించి బాధితుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం విచారణ నివేదికను వారు పాడేరులో డీఆర్‌డీఏ పీడీ మురళికి అందజేశారు.

నివేదికలోని అంశాలివే..

ఆర్థిక అవకతవకలకు సంబంధించి మొత్తం రూ. 26.38 లక్షలు దుర్వినియోగం కాగా, దానిలో రూ. 12.29 లక్షలను అప్పటి సిబ్బందితో సహా తొమ్మిది మంది వ్యక్తులు వ్యక్తిగతంగా దుర్వినియోగానికి పాల్పడినట్టు నివేదికలో పొందు పరిచారు. దీంతోపాటు స్వయం సహాయక సభ్యుల నుంచి రికవరీ చేసిన రూ.14.08 లక్షల సొమ్మును వారి అప్పు ఖాతాల్లోకి జమ చేయకుండా సిబ్బంది అవకతవకలకు పాల్పడ్డారని కమిటీ సభ్యులు తేల్చారు. సభ్యులు చెల్లించిన రికవరీ సొమ్మును గ్రామ సంఘాలకు సరిగా చెల్లించకుండా, ఆన్‌లైన్ టాగింగ్, సర్దుబాటు చేయలేదని పేర్కొన్నారు. రికవరీ మొత్తాలను గ్రామసంఘాల ఖాతాలకు నేరుగా జమ చేయకుండా అప్పట్లో పని చేసిన ఇద్దరు సీసీలు, బుక్‌కీపర్ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని కమిటీ సభ్యులు తేల్చారు.



చింతూరు మండలం ఎర్రంపేటలో స్వయం సహాయక సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న కమిటీ సభ్యులు(ఫైల్)

చర్యలకు ఆదేశం

విచారణ కమిటీ నివేదికను డీఆర్‌డీఏ పీడీ అందజేశారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఏపీడీని ఆదేశించాం. దీంతోపాటు దుర్వినియోగమైన సొమ్ము రికవరీ జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఐటీడీఏ పీవో, చింతూరు

నిర్లక్ష్యం ఉపేక్షించం

- గిరిజన విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి
- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

పాడేరు రూరల్ : గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ హెచ్చరించారు.స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో 11 మండలాల ఏటీడబ్ల్యూవోలు, ఎంఈవోలు, హెచ్‌ఎంలతో గురువారం సమావేశం నిర్వహించారు. గిరిజన సంక్షేమ శాఖలో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో మినహా బయట జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పాల్గొంటే అందుకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలే బాధ్యత వహించాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో బయట వ్యక్తులకు ప్రవేశం కల్పించకూడదని, విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులకు నిర్దిష్ట సమయంలో మాత్రమే అనుమతించాలన్నారు. వసతి గృహాల్లో విధిగా మూమెంట్ రిజిస్టర్ ఏర్పాటు చేయాలన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేశామని ఇక్కడి నుంచి పర్యవేక్షిస్తామని చెప్పారు. ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య కార్యకర్తల నియామకం కోసం ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు.ఈ ఏడాది కూడా స్కూల్ కాంప్లెక్స్, మండల, ఐటీడీఏ స్థాయిల్లో గిరిజన విజ్ఞాన సంబరాలు నిర్వహిస్తామని, వాటిని విజయవంతం చేయాలని సూచించారు. జనవరి 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక రూపొందించి ప్రత్యేక శిక్షణ, పఠన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశానికి డుంబ్రిగుడ ఎంఈవో త్రినాథ్ హాజరు కాకపోవడంతో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అనంతరం ఇటీవల అవార్డు తీసుకున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణను ఉద్యోగులు సన్మానించారు.

దళారులను నమ్మొద్దు

కాఫీ బోర్డ్ డిప్యూటీ డైరెక్టర్ గోవంతి



ములుశోభలో రైతులకు అవగాహన కల్పిస్తున్న కాఫీ బోర్డు అధికారులు

హుకుంపేట: కాఫీ రైతులు దళారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వారిని నమ్మి మోసపోవద్దని కాఫీ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ గోవంతి తెలిపారు. మండలంలోని సూకురు పంచాయతీ ములుశోభ గ్రామంలో స్థానిక సర్పంచ్ దనసాని సత్యవతి అధ్యక్షతన గురువారం కాఫీ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవంతి మాట్లాడుతూ కాఫీ సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని చెప్పారు. ఏజెన్సీలో నాంది ఫౌండేషన్, మన్యతోరణం,వనఫల స్వచ్ఛంద సంస్థలు గ్రేడింగ్ పద్ధతిలో కాఫీ గింజలను కొనుగోలు చేస్తున్నాయని, అలాకాకుండా చిన్న,పెద్ద గింజలను ఒకే ధరతో కొనుగోలు చేయాలని కలెక్టర్ ఆదేశించారని చెప్పారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు. సంతల్లో దళారులకు కాఫీ గింజలు అమ్మి మోసపోవద్దని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ వార్డెన్ దంపతుల అనుమానాస్పద మృతి

- కొత్తభల్లుగూడలో ఘటన
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు



రాధ, సుమాన్ (ఫైల్)



దీనంగా చూస్తున్న బెసిజోయి, బేతెవ్‌జాసువ



పాఠశాల క్వార్టర్‌లో ఉన్న మృతదేహాలు

అరకులోయ రూరల్: మండలంలోని కొత్త భల్లుగూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల డిప్యూటీ వార్డెన్ గుజ్జెలి రాధ (30), ఆమె భర్త నన్ని సుమాన్ (35) బుధవారం రాత్రి వారు నివాసం ఉంటున్న క్వార్టర్ గదిలో విషం తాగి ఆత్మహత్య చేసుకున్నారు. పాఠశాల సిబ్బంది ఫిర్యాదు మేరకు అక్కడికి చేరుకున్న ఎస్‌ఐ సంతోష్ సంఘటనపై ఆరా తీశారు. పోస్టుమార్టానికి మృతదేహాలను ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. అరకు సంతబయలుకు చెందిన గుజ్జెలి రాధ, హుకుంపేట మండలం బూర్జా గ్రామానికి చెందిన నన్ని సుమాన్‌లకు సుమారు 15 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి బెసిజోయ్ (9), బేతెవ్ జాసువ(7), ఆకాష్‌పాల్ (3) అనే ముగ్గురు పిల్లలున్నారు. పెద్ద పిల్లలిద్దరూ విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. రాధ వార్డెన్‌గా పనిచేస్తుండగా, సుమాన్ ఖాళీగా ఉంటున్నాడు. భార్యాభర్తలు, చిన్న కుమారుడు ఆకాష్ పాల్ అరకు సంతబయలులో రాధ అమ్మగారి ఇంటి వద్ద ఉంటున్నారు. తరచూ కార్వర్టర్‌కు వస్తుంటారు. వీరి మరణానికి కారణం తెలియరాలేదు. మనస్పర్థల కారణంగా క్షణికావేశంతో వీరు ఆత్మహత్యకు పాల్పడినట్టు భావిస్తున్నారు. అయితే బంధువులు అనుమానాలు వ్యక్తం చేయడంతో అనుమానాస్పద మరణాలుగా పోలీసులు కేసు నమోదు చేశారు. రాధా,సుమాన్ మృతితో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. వారి పిల్లలు బెసిజోయ్, బేతెవ్ జాసువ, ఆకాష్‌పాల్ అనాథులయ్యారు. ఆ చిన్నారులను చూసిన స్థానికులు కంటతడిపెట్టారు.

ఎమ్మెల్యే పరామర్శ

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పార్టీ శ్రేణులతో కలిసి పాఠశాలకు వెళ్లారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అందుబాటులోకి మరిన్ని సూట్స్

- ఏపీ పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ శ్రీనివాస్ పాణి

చింతపల్లి:లంబసింగిలో ఏపీ టూరిజం హరితా హిల్ రిసార్ట్స్‌లో మరిన్ని గదులను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ శ్రీనివాస్ పాణి తెలిపారు. గురువారం ఆయన లంబసింగిలో పర్యటించి భవనాలను పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న మూడు ఏసీ డీలక్స్ గదులను మరో రెండు వారాల్లో పూర్తిచేసి పర్యాటకులను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ప్రస్తుతం 4 ఏసీ, 4ప్రిమియం సూట్స్ అందుబాటులోకి తీసుకువచ్చినట్టు చెప్పారు. పర్యాటకులు ఆన్‌లైన్‌లో వీటిని బుక్ చేసుకోవాలని తెలిపారు. ఏసీ సూట్స్‌కు రూ.6.160, ప్రిమియం సూట్స్‌కు రూ.7.280 చెల్లించాల్సి ఉంటుందన్నారు. నాలుగు టెంట్స్ కాటేజీలకు డిమాండ్‌ను బట్టి రూ.2,400 నుంచి రూ.2,800 వరకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఏసీ డీలక్స్ గదులు పూర్తయితే ధర రూ.3,900 ఉంటుందన్నారు. పర్యాటకులు 23 గంటల పాటు బస చేసేందుకు అనుమతిస్తామని చెప్పారు. అల్పాహారం, స్నానాలకు వేడినీళ్లు ఉచితంగా అందిస్తామన్నారు. నిర్మాణంలో ఉన్న ఏసీ డీలక్స్ గదుల పనులను ఆయన పరిశీలించారు.

విధుల్లో చేరిన చింతూరు తహసీల్దార్

చింతూరు: వారం పాటు సస్పెన్షన్‌కు గురైన చింతూరు తహసీల్దార్ సాయికృష్ణ తిరిగి గురువారం విధుల్లో చేరారు. ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు చేశారనే అభియోగంతో సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ వేటు వేశారు. ఈ సస్పెన్షన్ కాలం పూర్తి కావడంతో విధుల్లో చేశారు.

కాకినాడలో కిడ్నీ బాధితుడికి పింఛన్ అందజేత



కాకినాడ జి.జి.హెచ్‌లో యోహాన్‌కు పింఛన్ అందజేస్తున్న గ్రామ వలంటీర్ ఉదయ భాస్కరకుమారి

అడ్డతీగల: రెండు కిడ్నీలు పాడై కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న అడ్డతీగల మండలం గొండోలుకి చెందిన డోకుబుర్ర యోహాను(64)కు గురువారం పింఛన్ అందజేశారు. గ్రామ వలంటీర్ పులిమెట్ల ఉదయ భాస్కరకుమారి అక్కడకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేసింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా అందిస్తున్న సేవలకు యోహాన్ తోపాటు అతని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఐదుగురు పందెంరాయుళ్ల అరెస్టు



పోలీసులతోపాటు పందెంరాయుళ్లు

ముంచంగిపుట్టు: మండలంలో జర్జుల పంచాయతీ గుర్రలబయలు గ్రామ సమీపంలో జరుగుతున్న కోడిపందాలపై గురువారం పోలీసులు దాడి చేశారు. కోడిపందాలు ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్టు స్థానిక ఎస్‌ఐ కె.రవీంద్ర తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.3,200 నగదుతో పాటు మూడు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఈ దాడుల్లో ఏఎస్‌ఐ తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఇగ్నో వార్షిక పరీక్షలు

ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) వార్షిక పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయని ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. విశాఖ ప్రాంతీయ కేంద్రం పరిధిలోని 5 జిల్లాల విద్యార్థులకు 7 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయని పేర్కొన్నారు. విశాఖ పరిధిలో 4 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థులంతా హాల్‌టికెట్లను ఇగ్నో వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

ఏవోబీలో ముమ్మర తనిఖీలు

- నేటి నుంచి మావోయిస్టుల పీఎల్‌జీఏ వారోత్సవాలు
- రాజకీయ నాయకులకు నోటీసులు జారీ



సీలేరులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ



జీకేవీధిలో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు



రాజవొమ్మంగి: బోయపాడు జంక్షన్‌లో వాహన తనిఖీల్లో పోలీసులు



ముంచంగిపుట్టులో డాగ్ స్క్వాడ్‌తో గాలింపులు చేస్తున్న సీఆర్పీఎఫ్ పోలీసు బలగాలు

ముంచంగిపుట్టు/గూడెంకొత్తవీధి/సీలేరు/కొయ్యూరు/రాజవొమ్మంగి/జి.మాడుగుల/చింతపల్లి రూరల్: ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. సీపీఐ మావోయిస్టు పార్టీ పీఎల్‌జీఏ (పీపుల్స్ లిబరేషన్ గొరిల్లా ఆర్మీ) వారోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా సరిహద్దులో పోలీసు బలగాలు కూంబింగ్‌ను ముమ్మరం చేశాయి. ముంచంగిపుట్టులో సీఆర్పీఎఫ్ బలగాలు పహారా కాస్తూ రాకపోకలపై నిఘా ఉంచాయి. ముఖ్యంగా మారుమూల నుంచి మండల కేంద్రాలకు వచ్చే వాహనాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ తనిఖీలు చేశాయి. ప్రయాణికుల వివరాలు సేకరించి విడిచి పెట్టాయి. ముంచంగిపుట్టు నుంచి జోలాపుట్టు, కుమడ, కుజభంగి మార్గాల్లో కల్వర్టులు, వంతెనలను డాగ్, బాంబ్ స్క్వాడ్‌లతో తనిఖీలు చేశాయి. వారోత్సవాల నేపథ్యంలో అధికార పార్టీ నేతలు, హిట్ లిస్ట్‌లో ఉన్నవారు మారుమూల పర్యటనలకు వెళ్లకూడదని ముందస్తుగా పోలీసులు నోటీసులు జారీ చేశారు. సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. మారుమూల ప్రాంతాల్లో రహదారి పనులకు సంబంధించిన ప్రొక్లెయిన్లు, జేసీబీలు, రోలర్లు, లారీలను మండల కేంద్రాలకు తరలించారు. గత కొద్ది రోజులుగా సరిహద్దులో మావోయిస్టుల కదలికలు అధికమవ్వడంతో ముందస్తుగానే పోలీసులు అప్రమత్తమై ఎటువంటి అలజడులకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నారు. మారుమూల గిరిజన గ్రామాల్లో సైతం వారోత్సవాలతో గిరిజనులు వారం రోజులపాటు గ్రామాలకే పరిమితం అవ్వనున్నారు. సరిహద్దు ప్రాంతామైన ఒనకఢిల్లీ, మాచ్‌ఖండ్, జోలాపుట్టు గ్రామాల్లో సైతం బీఎస్ఎఫ్ బలగాలు సరిహద్దు రాకపోకలకు నిఘాను పెంచాయి. గురువారం స్థానిక ఎస్‌ఐ రవీంద్ర ఆధ్వర్యంలో ముంచంగిపుట్టులో విస్తృతంగా తనిఖీలు చేశారు. ప్రయాణికుల బ్యాగులు, లగేజిలు పరిశీలించి విడిచి పెట్టారు. మూడు రోజులుగా రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తూ ప్రభుత్వ కార్యాలయాల వద్ద పోలీసులతో గస్తీని ఏర్పాటు చేశారు.

- జీకేవీధిలో గురువారం వారపుసంత కావడంతో వచ్చి వెళ్లే వాహనాలన్నిటినీ ఆపి తనిఖీలు చేశారు. సీఐ అశోక్‌కుమార్, ఎస్సై అప్పలసూరి, సీఆర్పీఎఫ్ సహాయ కమాండెంట్ బీరేంద్రసింగ్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి.
- సీలేరు పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలలో సీఆర్పీఎఫ్ స్థానిక పోలీసులు ఏరియా డామినేషన్ నిర్వహించారు. ఎస్‌ఐ జె.రామకృష్ణ ఆధ్వర్యంలో సీలేరు గ్రామంలో ముమ్మరంగా వాహన తనిఖీలు చేశారు. విశాఖపట్నం నుంచి దారాలమ్మ ఘాట్ రోడ్డు మీదుగా అంతర్ రాష్ట్రాలకు వెళ్లే అన్ని ఆర్టీసీ బస్సులను రాత్రి పూట నిలిపివేశారు.
- కొయ్యూరు సీఐ స్వామినాయుడు, ఎస్‌ఐ రాజారావుల ఆధ్వర్యంలో కొయ్యూరు–బాలరేవుల రహదారిలో వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు.
- రాజవొమ్మంగి ఎస్సై గోపీనరేంద్రప్రసాద్ నేతృత్వంలో సివిల్, స్పెషల్ పోలీసులు బోయపాడు జంక్షన్ వద్ద కాపు కాసి వచ్చే పోయే వారిని ప్రశ్నించారు. వాహనాల రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి వదిలిపెట్టారు.
- సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్‌ఐ శ్రీనివాస్, పోలీస్ బలగాలతో జి.మాడుగుల–నుర్మతి, మద్దిగరువు రోడ్డు మార్గంలో కల్వర్టులు, అనుమానిత ప్రాంతాలు, వారపు సంతలోను డ్రోన్స్ ద్వారా, డాగ్, బాంబ్ స్క్వాడ్‌లతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. పర్యాటకులపై నిఘా పెట్టినట్టు ఎస్‌ఐ తెలిపారు.
- చింతపల్లి సీఐ రమేష్ ఆధ్వర్యంలో అంతర్ల, లంబసింగిలో వాహనాలు తనిఖీ చేశారు. అన్నవరం పరిధిలో ఎస్‌ఐ సాయికుమార్ వాహనాల తనిఖీ చేపట్టారు.

నేపాల్ దుస్తులు ధరించి, పదవీ విరమణ

- నేపాల్ తమంగ్ వస్త్రాలతో ఆకట్టుకున్న జెన్‌కో ఉద్యోగి



నేపాల్ వస్త్రాలు ధరించి, పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న బాబులాల్‌మొక్కాన్ దంపతులు

సీలేరు: ఎవరైనా తమకు సంబంధించిన వేడుకల్లో ఖరీదైన వస్త్రాలు ధరించి, ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటారు. కానీ ఓ జెన్‌కో ఉద్యోగి వినూత్నంగా ఆలోచించి, తన పదవీ విరమణ రోజున తమ సంప్రదాయ వస్త్రాలను ధరించి అందరినీ ఆకట్టుకున్నారు. సీలేరు ఏపీ జెన్‌కోలో నేపాల్‌కు రాష్ట్రానికి చెందిన బాబులాల్‌మొక్కాన్ అనే వ్యక్తి 30ఏళ్లుగా ఉద్యోగం చేస్తున్నారు. గురువారం ఆయన పదవీవిరమణ సందర్భంగా జరిగిన కార్యక్రమంలోని నేపాల్ రాష్ట్రానికి చెందిన తమంగ్ వస్త్రాలు వేసుకుని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరూ ఆయనతో ఫొటోలు, సెల్ఫీలు దిగారు.

హెచ్‌ఐవీపై అప్రమత్తంగా ఉండాలి

- వరల్డ్ ఎయిడ్స్ ర్యాలీని ప్రారంభించిన పీవో



చింతూరులో ర్యాలీని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రంపచోడవరం: ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, దీనిని తరిమికొట్టేందుకు చైతన్యంతో మెలగాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ డే పురస్కరించుకుని స్థానిక ఐటీడీఏ కార్యాలయం నుంచి విద్యార్థులతో ఏర్పాటు చేసిన ర్యాలీని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హెచ్‌ఐవీ నివారణ కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాయన్నారు. హెచ్‌ఐవీ బారిన పడిన వారు తగిన జాగ్రత్తలు తీసుకుంటే, జీవిత కాలాన్ని పొడిగించుకోవచ్చన్నారు. రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో వరల్డ్ ఎయిడ్స్ డే నిర్వహించారు. ఆస్పత్రి ఇన్‌చార్జి కల్పన, డాక్టర్ రాధిక పాల్గొన్నారు.

గర్భిణులంతా హెచ్‌ఐవీ పరీక్షలు చేసుకోవాలి

చింతూరు: హెచ్‌ఐవీ వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చింతూరు సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా వైద్య శాఖ ఆధ్వర్యంలో గురువారం చింతూరులో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెచ్‌ఐవీ అంటువ్యాధి కాదని, వివిధ కారణాలతో సోకుతుందన్నారు. గర్భిణులంతా తప్పనిసరిగా ముందు జాగ్రత్తగా హెచ్‌ఐవీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, డాక్టర్ ఉదయ్‌కుమార్, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు పక్కాగా మెనూ అమలు

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశం



రంప వాటర్ ఫాల్స్ వద్ద నిర్వాహకులతో మాట్లాడుతున్న పీవో

రంపచోడవరం: గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహార పదార్థాలు పెట్టాలని పీవో సూరజ్ గనోరే అధికారులను ఆదేశించారు. బూసిగూడెం బాలికల ఆశ్రమ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడారు. రోజూ ఏయే ఆహార పదార్థాలు పెడుతున్నారని అడిగి తెలుసుకున్నారు. వారి విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. నాణ్యత లేని వస్తువులు సరఫరా చేస్తే తిరస్కరించాలన్నారు. అనంతరం రంప శివాలయం సమీపంలోని పర్యాటక కేంద్రాన్ని సందర్శించారు. పర్యాటకులకు కల్పించిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.

అన్ని వర్గాల వారికి పారదర్శకంగా పదవులు



నూతన మార్కెట్ చైర్మన్ రాజరమేష్, డైరెక్టర్లను ప్రమాణ స్వీకారం చేయిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

- నూతన మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ: వ్యవసాయంతోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. స్థానిక అరకు సంతబయలు కేంద్రంలో అరకు మార్కెట్ యార్డులో అరకు నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ముఖ్య అతిథిగా హాజరై మార్కెట్ యార్డు చైర్మన్ కిల్లో రాజరమేష్, వైస్ చైర్మన్ కొండలరావుతోపాటు డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు, అరకులోయ, అనంతగిరి మండలాల్లో నుంచి ఎన్నికైన మార్కెట్ కమిటీ డైరెక్టర్లు 18 మందితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి పారదర్శకంగా పదవులు ఇవ్వడమే కాకుండా విద్యావంతులకు మార్కెట్ కమిటీలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చోటు కల్పించారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా పంట ఉత్పత్తుల కొనుగోలుతో రైతులకు మరింత మేలు జరుగుతుందన్నారు. అనంతరం సంతబయలు నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీలు ఉషారాణి, నీలవేణి, జెడ్పీటీసీలు కూడా బొంజుబాబు, స్వచ్ఛాంధ్రా కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు శెట్టి గోపాల్, మహిళా విభాగం మండలాధ్యక్షురాలు శాంతి, సీనియర్ నాయకులు శ్రీరాములు, కృష్ణారావు, బాక సింహాచలం, గణపతి, వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు, మాజీ ఎంపీపీ అరుణకుమారి, సర్పంచ్‌లు నాగేశ్వరరావు, వెంకటరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కొములు నాయుడు, శెట్టి అప్పలు పాల్గొన్నారు.

ఎస్‌ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

- 10న విశాఖలో అర్హత పరీక్ష

కొయ్యూరు: ఎస్‌ఐ, కానిస్టేబుల్ పరీక్షలకు సంబంధించి అభ్యర్థులకు గుంటూరు జిల్లా పెదపరిమిలో ఉచిత భోజన వసతితో కూడిన శిక్షణ ఇస్తామని రాంకీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎంపీ రామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల ఆరో తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు రాంకీ ఫౌండేషన్ (9390502357)ను సంప్రదించాలని కోరారు. ఈ నెల 10న ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించి వైజాగ్ సిటీలో అర్హత పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఇందులో ఉత్తీర్ణత సాధించిన 300 మంది యువతీ యువకులకు పెదపరిమిలోని రాంకీ ఫౌండేషన్ నైపుణ్య కేంద్రంలో శిక్షణ ఇస్తామన్నారు. స్టడీ మెటీరియల్‌తో పాటు ఉచిత భోజన వసతి ఉంటుందన్నారు. మరో 500 మందికి ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తామన్నారు.

హార్బర్‌లో నిఘా నేత్రాలు!

- 50కి పైగా సీసీ కెమెరాల ఏర్పాటుకు సన్నాహాలు
- ఈ ఓడరేవులో తరచూ దొంగతనాలు
- కొన్నేళ్లుగా చేపలు, ఇతర సామగ్రి తస్కరణ
- చోరీల అడ్డుకట్టకు మరపడవల సంఘం యత్నం

సాక్షి, విశాఖపట్నం: కొన్నేళ్లుగా విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో దొంగతనాలు జరుగుతున్నాయి. చేపలతో పాటు విలువైన సామగ్రి కూడా చోరుల పాలవుతున్నాయి. 25 హెక్టార్లలో సువిశాలంగా ఉన్న ఈ ఓడరేవులో కేవలం నాలుగు సీసీ కెమెరాలే ఉన్నాయి. గతంలో విశాఖ పోర్టు అథారిటీ వీటిని గంగాలమ్మ గుడి, నవభారత్, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయం, హెచ్‌పీసీఎల్ బంకు ప్రాంతాల్లో ఏర్పాటు చేసింది. అయినప్పటికీ తరచూ ఈ హార్బర్‌లో చోరీలు జరుగుతూనే ఉన్నాయి. మత్స్యకారులు రోజుల తరబడి సముద్రంలో వేటాడి తెచ్చిన చేపలను హార్బర్‌లో భద్రపరచుకుంటారు. అలాగే పలువురు మత్స్యకారులు పగటి పూట ఈ హార్బర్ ప్లాట్‌ఫాంలపైనే చేపలను ఎండబెట్టుకుంటారు. సాయంత్రం వాటిని చిన్న చిన్న పెట్టెల్లో ఉంచుకుని ఇళ్లకు వెళ్లిపోతారు. రాత్రి వేళ వచ్చి చేపలను, ఎండు చేపలను దొంగలు ఎత్తుకుపోతున్నారు. బోట్లకు సంబంధించిన సామగ్రిని, పరికరాలను కూడా దొంగిలించుకుపోతున్నారు. ఎత్తుకుపోయిన చేపలను తిరిగి హార్బర్‌లోనూ, ఇతర ప్రాంతాల్లోనూ అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. హార్బర్‌లో తగినన్ని సీసీ కెమెరాలు లేకపోవడంతో చోరీలకు ఎవరు పాల్పడుతున్నారో గుర్తించడానికి వీలు పడడం లేదు. ఈ ఫిషింగ్ హార్బర్‌లో చోరీలపై కొన్నాళ్లుగా మత్స్యకారులు, బోటు యజమానులు ఆందోళన చెందుతున్నారు. ఈ హార్బర్ విశాఖ పోర్టు అథారిటీ (వీపీఏ) ఆధీనంలో ఉంది. ఈ ఓడరేవులో తరచూ దొంగతనాలు జరుగుతున్నందున మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మత్స్యకారులు, బోటు ఓనర్లు పోర్టు అధికారులను ఎప్పట్నుంచో కోరుతున్నారు. ఇటీవల ఈ హార్బర్ పరిశీలనకు వచ్చిన కేంద్ర మత్స్యశాఖ కార్యదర్శి జతీంద్రనాథ్ స్వైయిన్‌కు కూడా విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో ఫిషింగ్ హార్బర్‌లో సుమారు 50 వరకు సీసీ కెమెరాలను దశల వారీగా ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్టు రాష్ట్ర మరపడవల సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ 'సాక్షి'తో చెప్పారు. ఇందుకు అవసరమైన నిధులను సంఘం తరపున బోటు యజమానుల సహకారంతో తాము సమకూర్చాలని నిర్ణయించామన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా ఈ ఓడరేవులో దొంగతనాలను కట్టడి చేయడానికి వీలవుతుందని ఆయన తెలిపారు.

గోడౌన్ ఇన్‌చార్జిపై అసిస్టెంట్ కలెక్టర్ ఆగ్రహం



గోడౌన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

జి.మాడుగుల: స్థానిక జీసీసీ మండల స్టాకు పాయింట్ గోడౌన్‌లో అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. బియ్యం , సరుకుల వివరాలు రికార్డుల సక్రమంగా లేకపోవటంతో గోడౌన్ ఇన్‌చార్జి సింహాచలంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ కె. అప్పలస్వామి తదితరలు పాల్గొన్నారు.

చెట్టుకు ఉరి వేసుకున్నట్టు నిరసన

మా భూములు మాకు అప్పగించండి
లేకపోతే ఆత్మహత్యలే శరణ్యం



చింతచెట్టుకు ఉరి వేసుకుని నిరసన తెలుపుతున్న బూరుగు, చినకోనేల గిరిజనులు

అనంతగిరి: తమ భూములను భూస్వాముల పేరు మీద మార్పు చేశారని, వాటిని తమకు అప్పగించాలని కోరుతూ మండలంలోని రొంపల్లి పంచాయతీ బూరుగు, చినకోనేల గ్రామాల గిరిజనులు గురువారం గ్రామ సమీపంలోగల చింతచెట్టు ఉరి వేసుకున్నట్టు నిరసన వ్యక్తం చేశారు. బూరుగు, చినకోనెల గ్రామాల్లో 72 కుటుంబాలకు చెందిన గిరిజనులు జీవిస్తున్నారు. బూరుగు రెవెన్యూ 1 నుంచి 7 సర్వేలో గల 90 ఎకరాలు, చినకోనెల రెవెన్యూ పరిధిలోని 30 ఎకరాల భూములు తాతలు, తండ్రుల నుంచి వారసత్వంగా వస్తున్నట్టు గ్రామస్తులు చెప్పారు. భూముల్లో మెట్ట వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, తమకు తెలియకుండానే భూములను భూస్వాముల పేర్ల మీదకు మార్పు చేశారని తెలిపారు. దీనిపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి, భూములు తమకు అప్పగించాలని వారు అధికారులను కోరారు.

అరకులోయ అభివృద్ధి ప్రశంసనీయం



ఎమ్మెల్యే పాల్గుణతో రాష్ట్ర హితకారిణి సమాజ్ చైర్‌పర్సన్ కాశి మునికుమారి

సాక్షి,పాడేరు: అరకులోయ అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఇతర ప్రభుత్వ పెద్దలతోపాటు, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చేస్తున్న కృషిపై రాష్ట్ర హితకారిణి సమాజ్ చైర్‌పర్సన్ కాశి మునికుమారి సంతోషం వ్యక్తం చేశారు. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన ఆమె గురువారం అరకులోయలో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు.

సంగమేశ్వర ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే బృందం



సంగమేశ్వర ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, దేవదాయ అధికారులు

దేవీపట్నం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో గండిపోశమ్మ అమ్మవారి ఆలయం ముంపునకు గురవుతోంది. అమ్మవారి మూలవిరాట్టుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రక్షించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, దేవదాయ శాఖ అధికారులతో కలిసి గురువారం కర్ణాటక రాష్ట్రం సంగమేశ్వర ఆలయాన్ని సందర్శించారు. అక్కడ అలమట్టి డ్యాం (నారాయణపూర్ రిజర్వాయర్) నిర్మాణంలో ఆలయం మునిగిపోకుండా చుట్టూ బావి తరహా (ఇన్‌టెక్ వెల్) కట్టడం, లోపలికి వెళ్లేందుకు మెట్లు నిర్మించారు. ఈ నిర్మాణాన్ని ఎమ్మెల్యే బృందం ఎంపీపీ కుంజం మురళీ, వైఎస్సార్‌సీపీ నాయకులు తోట రాజేశ్వరరావు, కందుల బాబ్జి, దేవదాయ శాఖ అధికారులు ఎన్ విజయరాజు, కలుం శ్రీను పరిశీలించారు.